క్లుప్తంగా

వీరేశ్వరుని సన్నిధిలో ఎన్నికల పరిశీలనాధికారి



ఎన్నికల పరిశీలనాధికారిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

ఐ.పోలవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలనాధికారి కె.హర్షవర్ధన్ మంగళవారం మురమళ్ల వీరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పర్యవేక్షణాధికారి కలారి శ్రీనివాసరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు దర్శనం చేయించారు. స్వామి వారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆయన వెంట అమలాపురం ఆర్డీవో మాధవి ఉన్నారు.

ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీ



అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో దూర ప్రాంత బస్సుల్లో 10 శాతం రాయితీ అందిస్తునట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం డిపో నుంచి హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లే ఏసీ అమరావతి, నైట్ రైడర్ ఇంద్ర సర్వీసుల్లో ప్రయాణికులకు టికెట్‌పై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం డిసెంబర్ 31 వరకు అమలులో ఉంటుందన్నారు.

స్పేస్ సైన్స్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత సైంటిస్టు యాళ్ల శివప్రసాద్

ముమ్మిడివరం: విశ్రాంత ఇస్రో సైంటిస్ట్ యాళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాకెట్ ప్రయోగాలు, స్పేస్ సైన్సుపై అవగాహన కల్పించారు. గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల, ముమ్మిడివరం రవీంద్ర పబ్లిక్ స్కూల్లో మంగళవారం ఆయన అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. విద్యార్థుల్లో సైన్సు పరిజ్ఞానాన్ని పరీక్షించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గొర్రెల ఉదయ్ భాస్కరరావు, జేవీఎల్ నరసింహారావు, పాత్తూరి లక్ష్మీ శ్రీనివాసన్, వీర వెంకట సత్యనారాయణ రాజు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నాయుడికి మాజీ మంత్రి కన్నబాబు పరామర్శ



వెంకన్నాయుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: ఇటీవల గుండె సంబంధిత వైద్యం పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడిని మాజీ మంత్రి, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు మంగళవారం పరామర్శించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు కల్వకొలను ఉమ తదితరులు నాయుడిని పరామర్శించారు.

మద్యం దుకాణాలకు సీళ్లు

అమలాపురం టౌన్: ఈనెల 5న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో మంగళవారం సాయంత్రం నుంచే జిల్లాలోని 133 మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూసి వేయించారు. ఎన్నికలు జరిగే గురువారం సాయంత్రం వరకూ ఈ దుకాణాల మూసివేతకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ శాఖ మద్యం దుకాణాలను మూసివేసింది. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ ఆదేశాలతో దుకాణాలకు సంబంధిత అధికారులు సీళ్లు వేస్తున్నారు. అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయించినట్లు సీఐ వీకేవీవీ సత్యనారాయణ తెలిపారు. అయితే అమలాపురం పట్టణం, ముమ్మిడిరం, అంబాజీపేట తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి అయినా ఇంకా కొన్ని మద్యం దుకాణాలు తెరుచుకుని అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం.

మద్యంషాపుల మూసివేతకు ఆదేశాలు

యానాం: ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్స్ నియోజకవర్గానికి ఈనెల 5న ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు యానాం నియోజకవర్గంలో ఎఫ్‌ఎల్1, ఎఫ్‌ఎల్2 మద్యంషాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసి వేయాలని మంగళవారం డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ మునిస్వామి ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా కౌంటింగ్ రోజు సైతం మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసి వేయాలని ఆదేశించారు.

కళ్లాల్లోనే ధాన్యం... అన్నదాత దైన్యం

- కోనుగోలులో తీవ్ర జాప్యం
- ఆదుకోని రైతు సేవా కేంద్రాలు
- దళారుల చేతికే పంట
- ప్రభుత్వ సహకారం ప్రకటనలకే పరిమితం



చినకొత్తలంకలో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతు



గాడిలంకలో తడిచిన ధాన్యపు రాశులు

ముమ్మిడివరం: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు ధాన్యం అమ్మకాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి గింజకు కనీస మద్దతు ధర ఇచ్చి రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో సరైన న్యాయం జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక గత్యంతరం లేక పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలోనే పోస్తున్నారు. పూర్తి స్థాయిలో వరి కోతలు కాలేదనే కారణంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేదని చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కోతలు ముమ్మరంగా జరిగాయి. తుపానుకు ముందే రోడ్ల పక్కన ధాన్యం రాశులు పోసి ఉండటం కనిపించింది. మద్దతు ధర వస్తే మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారస్తులకు సైతం అమ్మకాలు చేసుకోవచ్చుననే ప్రభుత్వ నిబంధనలు రైతులకు నష్టాన్నే కలిగిస్తున్నాయి. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని 75 కేజీల బస్తాను రూ.1350లకు మించి కొనుగోలు చేయలేమని వ్యాపారస్తులు అంటున్నారని రైతులు వాపోతున్నారు. మద్దతు ధర కావాలంటే ధాన్యం మూడు రోజులపాటు ఆరబెట్టాలని వ్యాపారస్తులు చెప్పటంతో తలలు పట్టుకుంటున్నారు. అసలే తుపాను, మబ్బులతో కూడిన వాతవరణం, ధాన్యం ఆరబెట్టేందుకు కళ్లాలు ఎక్కడ నుంచి వస్తాయని ధాన్యం అమ్ముకొనే పరిస్థితులు కానరావడం లేదని వాపోతున్నారు. ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 15,877 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా ఇప్పటివరకు 5,756 ఎకరాలల్లో వరి కోతలు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో ఇప్పటివరకు 60 శాతం కోతలు పూర్తయినట్లు అంచనా. కోతలు కోసిన ధాన్యాన్ని కళ్లాల్లోనే రాశులుగా పోసి ఉంచారు.

ఆరుగాలం శ్రమించినా దక్కని ఫలితం

ఆరుగాలం శ్రమ పడిన రైతుకు తగ్గ ఫలితం దక్కడం లేదు. ఎండనక, వాననకు కష్టించి విత్తు జల్లి, పంట పండించినా చేతికి వచ్చే సరికి దళారులదే రాజ్యంగా మారుతోంది. ప్రభుత్వాలు ధాన్యం కొనుగోళ్లలో కనీస మద్దతు ధర ప్రకటించినా ఆ ధర రైతులకు చెల్లించడానికి సవాలక్ష ఆంక్షలు పెడుతున్నాయి. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని, తాళ్లు, తప్పలు ఉన్నాయనే సాకుతో కోత విధించి రైతు శ్రమను దోపిడీ చేసి వారిని మోసం చేస్తూనే ఉన్నారు. అనాదిగా ధాన్యం వ్యాపారులు, ఎరువుల విక్రయదారులు, పెట్టుబడులు పెట్టే వారే రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వరి పండించే రైతులు ఎక్కువగా కౌలు రైతులే కావడంతో వారికి పెట్టుబడులన్నీ అప్పుల పైనే ఉంటాయి. ఈ అప్పులను త్వరగా తీర్చాలనే ఆతృతతో తక్కువ రేటుకే తమ ధాన్యాన్ని అమ్ముకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు.

అప్పు తీర్చేది ఎలా



“ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని 75 కేజీల బస్తా రూ.1350లకే దళారులు అడుగుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఆవకాశం లేదు. పోని అమ్ముదామంటే కౌలుకిచ్చిన యజమాని బస్తాకు రూ.1650లు ఇవ్వాలని అంటున్నారు. ఏమి చేయాలో తెలియడం లేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాను. అప్పులు తీర్చే పరిస్థితి కనబడటం లేదు.”

బొక్కా రాంబాబు, రైతు, గాడిలంక.

తుపాను ప్రభావం.. నష్టం అపారం



తుపాను కారణంగా మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు సూర్యనారాయణ



లచ్చిపాలెం పంచాయతీలో తడిచిపోయిన వరి పనలను ఒబ్బిడి చేసే పనిలో రైతులు

తాళ్లరేవు: ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలు, ఈదురు గాలులతో వరి పంటకు నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో వరిచేలు నీట మునిగి పూర్తిగా తడిచి పోయాయి. తుపానుకు ముందు మాసూలు చేసిన ధాన్యం సైతం మొలకెత్తి నష్టం సంభవించిందని రైతులు వాపోతున్నారు. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని పోలేకుర్రు, పి.మల్లవరం, నీలపల్లి, లచ్చిపాలెం తదితర గ్రామాల్లో పలు చోట్ల వరి పంటకు నష్టం వాటిల్లింది. లచ్చిపాలెం పంచాయతీలో పలు వరిచేలల్లో నీరు నిల్వ ఉండి వరిపనలు పూర్తిగా తడిచిపోవడంతో దానిని ఒబ్బిడి చేసేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పలు చోట్ల మాసూలు చేసి రాశులు వేసినప్పటికీ కింద నుంచి నీరు లాగేసి మొలక వచ్చింది. దీంతో రైతులు వాటిని ఆరబెట్టుకునే పనిలో పడ్డారు. మొలకెత్తిన ధాన్యం ఆరబెట్టినప్పటికీ పొల్లు కాయలుగా పోతుందని రైతులు అనిశెట్టి సూర్యనారాయణ, కనుమూరి రామ చంద్రారెడ్డిలు తెలిపారు. ఐదెకరాల చొప్పున కౌలు వ్యవసాయం చేస్తున్నామని తుపాను కారణంగా ఒక్కొక్కరికీ సుమారు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మోహన్‌కుమార్

ముమ్మిడివరం: యువత సైబర్ నేరాలకు గురవ్వకుండా ఉండాలంటే అనధికార యాప్‌లకు దూరంగా ఉండాలని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం బెంగళూరుకు చెందిన ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్, అమలాపురం కార్మెంట్ సిస్టర్స్ ఆఫ్ థెరిసా, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యువతకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే జాగ్రత్త వహించాలని అటువంటి కాల్స్‌కు సమాధానం చెప్పకుండా ఉండటమే మంచిదన్నారు. విద్యార్థులు, మహిళలు సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటికి దూరంగా ఉండాలని సీఐ సూచించారు. తెలుగు రాష్ట్రాల ఐఎస్ఐల కోఆర్డినేటర్ కరుణాకరరావు మాట్లాడుతూ ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో మానవ హక్కులు, చట్టాలపై గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, ఎస్సై డి.జ్వాలాసాగర్, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావులు మాట్లాడారు.

జోరుగా మద్యం అమ్మకాలు

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- దర్శనమిస్తున్న ఫ్లెక్సీలు



ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయం ఎదుట దర్శనమిస్తున్న ఫ్లెక్సీలు

అల్లవరం: డిసెంబర్ 5న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 3 సాయంత్రం 4 గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం వరకు, 9న కౌంటింగ్ రోజున మద్యం షాపులు మూసి వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆదేశాలు ఏమాత్రం అమలు కావటం లేదు. మంగళవారం రాత్రి వరకు మద్యం దుకాణాల్లో జోరుగా అమ్మకాలు జరిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం మద్యం విక్రయదారులు అతిక్రమిస్తున్నా మండల స్థాయి అధికారులు చోద్యం చూస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

ఉప్పలగుప్తం: ఉమ్మడి తూర్పు గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగినప్పటికీ కోడ్‌తో మాకేమీ సంబంధం లేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తుండటం నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ నెంబర్ 164 వద్ద ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించకపోవడంతో అధికారుల తీరుపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: స్థానిక ఎల్ఐసీ బ్రాంచిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలువురు రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల సంఘం కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ కె.సుధాకరరెడ్డి అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 150 మంది ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ ప్రసన్నకుమార్, ఏవోలు చక్రవర్తి, కామేశ్వరావు, డీవోల యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎస్ నాయుడు, డీవోలు రామారావు, రమేష్, రాజేంద్ర, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, వీరేంద్ర, అప్పారావు, శర్మ, క్రీస్తురాజు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ మెకానిక్‌లను ఆదుకోవాలి



మోటారు సైకిల్ మెకానిక్‌ల సమస్యలపై చర్చిస్తున్న అసోసియేషన్ నాయకులు

అమలాపురం టౌన్: మోటారు సైకిల్ మెకానిక్‌లకు ప్రభుత్వం చేయూత నివ్వాలని అమలాపురం వరసిద్ధి వినాయక మోటారు సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి గుద్దుటి రెడ్డినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక గొల్లగూడెంలో మంగళవారం జరిగిన మోటారు సైకిల్ మెకానిక్స్ సమావేశంలో రెడ్డినాయుడు మాట్లాడారు. జిల్లాలోని మెకానిక్స్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని సూచించారు. ఇప్పటి వరకూ ఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను గుర్తించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల మోటారు సైకిల్ మెకానిక్ కార్మికులు ఉపాధి పొందుతున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రతి టూ వీలర్ మెకానిక్‌ను కార్మికశాఖ ద్వారా గుర్తింపు ఇచ్చి ప్రభుత్వ పరమైన రాయితీలు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈ కార్డు ఉన్న ప్రతి మెకానిక్‌కు ప్రమాద బీమా, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. వయస్సు మళ్లిన మెకానిక్‌లకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోకరకొండ పూర్ణ బాల, కూర్మ నరిసింహారావు, నల్లా శ్రీనివాసరావు, కాండ్రేగుల గోపి, దంగేటి శ్రీను, అంజూరి వంశీ, మానేపల్లి రాము తదితరులు మాట్లాడారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్
- ఘనంగా యువ ఉత్సవ్



యువకులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యువత అన్ని రంగాల్లో రాణించి దేశాభివృద్ధికి అవసరమైన విజ్ఞానదాయక ఆవిష్కరణలు చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన యువఉత్సవ్–2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు యువకులు వివిధ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కే ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణసుధాకర్, యూత్ ఆఫీసర్ గోపి, వినయ్, కిరణ్ పాల్గొన్నారు. ముగింపు సభలో పాల్గొన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మోటూరికి సత్కారం

అమలాపురం రూరల్: మానవసేవే మాధవ సేవగా భావించి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న చిందాడగురువు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మోటూరి వెంకటేశ్వరరావుకు సత్కారం లభించింది. ఆయన సేవలను గుర్తిస్తూ కాకినాడ జేఎన్టీయూలో మంగళవారం జరిగిన విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు.

బాధితులకు అండగా ఉంటా

యానాం: కనకాలపేట అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి తాను అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన అగ్ని ప్రమాదం జరిగిన ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితుడు ఆచంట వీరబాబును ప్రమాద ఘటన గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కవల స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం అవసరం

ఆర్డీవో మాధవి



దివ్యాంగులకు వీల్‌చైర్‌లను పంపిణీ చేస్తున్న ఆర్డీవో మాధవి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి మహమ్మద్ రహంతుల్లా

అమలాపురం రూరల్: సమాజంలో దివ్యాంగుల హక్కులను కాపాడటంతో పాటు వారిని అన్ని విధాలా ప్రోత్సహించడానికి వారి పేరిట దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని రెవెన్యూ డివిజనల్ అధికారిణి కే.మాధవి పేర్కొన్నారు. ఈదరపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న హరిమనో వికాస కేంద్రం మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. అతిథిగా ఆర్డీవో మాధవి పాల్గొని దివ్యాంగ చిన్నారులతో కేక్‌కట్ చేయించారు. హరి మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ చేస్తున్న సేవలను గుర్తించి అభినందించారు.వీల్ చైర్లను ఉచితంగా పంపిణీ చేశారు కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్.రాజకుమార్ మేనేజర్ పి.ఆనంద్. పి.లోకేష్, వి.బాబి, కె.కోటి, ఆర్.శాంతకుమార్, రత్నం , ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సం

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెంలోని శ్రేయ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్కూలు వ్యవస్థాపకుడు, సదరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగ విద్యార్థుల వేడుకల్లో పాల్గొన్నారు. పలు రకాల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. స్కూలు ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కొర్లపాటి దశరథరామయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రీమన్నారాయణరావు మాట్లాడుతూ వైకల్యాన్ని భారంగా భావించరాదన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే అద్భుత విజయాలు సొంతమవుతాయన్నారు. తోటి దివ్యాంగులు సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. డాక్టర్ కె.అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు తులసి, ఉమాదేవి, కృష్ణకుమారి, ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ నాజర్, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు.

మెప్మా ఆధ్వర్యంలో

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దివ్యాంగుల దినోత్సవం జరిగింది. పట్టణంలోని 30 వార్డులకు చెందిన దివ్యాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విభిన్న ప్రతిభావంతులు ఉన్నతంగా రాణిస్తున్నారని మెప్మా జిల్లా కార్యాలయ ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన పలువురు దివ్యాంగులకు మెప్మా ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, టీఎల్ఎఫ్ రిసోర్స్‌పర్సన్లు, 30 వార్డుల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పించాలి

ముమ్మిడివరం: సమాజంలో దివ్యాంగుల హక్కులు కాపాడటంతో పాటు అన్ని రంగాల్లో వారికి సముచిత స్థానం కల్పించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ప్రతి ఏటా డిసెంబర్ 3న వారి పేరిట దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఆత్మస్థైర్యంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, న్యాయవాదులు, భవిత స్కూలు సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగ మహా సంఘటన్ ప్రతినిధికి సత్కారం

అమలాపురం టౌన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కాకినాడ జేఎన్టీయూలో మంగళవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పలు దివ్యాంగ సంఘాల ప్రతినిధులకు సత్కారాలు జరిగాయి. ఇందులో భాగంగా అమలాపురానికి చెందిన రాష్ట్ర దివ్యాంగ సంఘటన్ ప్రతినిధి నిమ్మకాయల సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వీవీవీఎస్ లక్ష్మణరావు, జాతీయ అంధుల సమాఖ్య అధ్యక్షుడు సుబ్బారావు తదితరుల చేతుల మీదుగా సురేష్‌కు సత్కారం జరిగింది.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ



శిక్షణకు హాజరైన అధికారులు

తాళ్లరేవు: ఈ నెల 8న నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్ పితాని త్రినాథరావు, ఇరిగేషన్ ఏఈ వి.అనూష, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియతో పాటు చేపట్టాల్సిన చర్యలను పీఓలు, ఏపీఓలకు ఇరిగేషన్ ఏఈ అనూష వివరించారు. ముఖ్యంగా మూడు పద్ధతుల్లో ఈ ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏకగ్రీవం ద్వారా ఎన్నిక చేయడం, చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, అవి రెండు కుదరని పక్షంలో ఓటింగ్ ద్వారా ఎన్నిక జరుగుతుందన్నారు. ఓటర్లను ఎలా గుర్తించాలి, సభ్యులను ఎలా ఎంపిక చేయాలనే అంశాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1997-98 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

అమలాపురం రూరల్: మండలంలో బండారులంక గ్రామానికి చెందిన పేరి రామేశ్వర శర్మ – బాసిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. 1997–98 ఏడాదికి చెందిన పదో తరగతి విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పలు ఉద్యోగాలు, వృత్తులలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వనభోజనాలు ఏర్పాటు చేసుకొని అంతా ఆనందంగా గడిపారు.